క్లుప్తంగా

వైభవంగా సీతారాముల ఉత్సవాలు ప్రారంభం



సీతారాములకు విశేష పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని సున్నంవారిచింతలలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, మూలవిరాట్లకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం కల్యాణ మహోత్సవం, ఆదివారం వసంతోత్సవం, పారువేటను నిర్వహించనున్నట్లు వివరించారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్



సంగం: మండలంలోని మక్తాపురంలోని ఇసుక రీచ్ నుంచి ఇసుక అక్రమ తరలింపునకు అధికారులు చెక్ పెట్టారు. శుక్రవారం గ్రామ రెవెన్యూ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో రీచ్‌కు వెళ్లే దారిలో జేసీబీ సాయంతో కందకాలను తవ్వారు. ఈ కందకాలను పూడ్చినా, ఇసుక అక్రమ రవాణా చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని వీఆర్వో ప్రసాద్ తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 111 మంది హాజరు



సంగం: స్థానిక గురుకుల బాలిక పాఠశాలలో 6, 7, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. 6, 7, 9 తరగతుల్లో ఉన్న 19 ఖాళీలకు 128 మంది దరఖాస్తు చేసుకోగా, 111 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపల్ సుమతి తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల వివరాలను సొసైటీకి పంపుతామని, వారు ఇచ్చిన జాబితా ప్రకారం విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటామని వివరించారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



ఆత్మకూరు(చేజర్ల): భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. చేజర్లలోని బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు గుండాల విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ మోర్చాల పూర్తి కమిటీలను ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంకు బాలయ్యనాయుడు, అల్లంపాటి నారాయణరెడ్డి, మహేష్‌నాయుడు, భద్రయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన సదస్సు



సంగం: మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. బడి నుంచి ఇంటికి వచ్చిన తరువాత తమ పిల్లలు ఎలా చదువుతున్నారని తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు విద్యాబోధనలోని ఎలాంటి ఇబ్బందులను మీ దృష్టికి వచ్చినా తమకు తెలియజేయాలని కోరారు.

'విద్యా ప్రవేశం'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

సీతారామపురం: 'విద్యా ప్రవేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని ఎంఈఓ మస్తాన్‌వలి కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు 'విద్యా ప్రవేశం'పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీతారామపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల హాజరును పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ ఈ నెల 28 నుంచి జూలై 25వ తేదీ వరకు విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా హెచ్‌ఎంలు లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రతి పాఠశాలలో పిల్లల హాజరు పెంపునకు కృషి చేయాలన్నారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఉండేలా చూడాలన్నారు. విద్యాప్రవేశంపై ర్యాలీలు, కళాజాత, తదితర కార్యక్రమాలను చేపట్టడంతో పాటు తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల హాజరును పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యా ప్రవేశానికి సంబంధించి ప్రణాళికలు రూపొందించుకుని అమలు పరచాలన్నారు. అమలు చేసిన వాటిని దీక్ష యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. బోధనాపరమైన అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ అభ్యసనా ప్రక్రియలో విద్యార్థులంతా ముందుండేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, సీఆర్‌ఎంపీలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే జీవకోటి మనుగడ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: మొక్కలతోనే జీవకోటి మనుగడ సాధ్యమని మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకయ్య అన్నారు. మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ చెట్లను విచక్షణారహితంగా నరికేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. భావితరాల మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు ఇరగన శ్రీనివాసులు, సభ్యులు నాగేశ్వరరావు, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపండి

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్



నేను బడికి పోతా ర్యాలీలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు(ఉదయగిరి): బడిఈడు పిల్లలను పనులకు కాకుండా పాఠశాలకు పంపాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. వింజమూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన నేను బడికి పోతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. పిల్లలను బడికి పంపితే ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి, పుస్తకాలతో పాటు మంచి పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని ఆయన కోరారు. అనంతరం బంగ్లాసెంటర్‌లో విద్యార్థులతో మానవహారం నిర్మించారు. అక్కడి నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ రఘురామయ్య, ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్

సీతారామపురం: వర్షాకాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సీతారామపురంలో శుక్రవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో చెత్త, మురుగు నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. డ్రైనేజీల్లోని పూడికను తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుమతి, ఏఎస్‌ఎం, తదితరులు ఉన్నారు.

చేజర్ల జూనియర్ కళాశాలలో 99 శాతం ఉత్తీర్ణత

ఆత్మకూరు(చేజర్ల): చేజర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 40 మందికి గానూ 39 మంది పాసై 99శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ప్రిన్సిపల్ జీ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చిలో తప్పిన విద్యార్థుల కోసం అధ్యాపకులతో ప్రత్యేక తరగతులను నిర్వహించామని తెలిపారు. అధ్యాపకుల కృషితో విద్యార్థులు ఉత్తీర్ణులవడంతో పాటు మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. సీనియర్ ఎంపీసీలో అనూష 717, బైపీసీలో బీ ప్రవల్లిక 651, సీఈసీలో ఎన్ నరసింహులు 600 మార్కులను సాధించి టాపర్లుగా నిలిచారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎలీషా 470 మార్కులకు గానూ 447, సీఈసీలో డీ కావేరి 500 మార్కులకుగానూ 300 మార్కులు సాధించారని వివరించారు.

మాదిగ జనజాతర జయప్రదానికి పిలుపు

మర్రిపాడు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జూలై 7న ఈదుమూడిలో నిర్వహిస్తున్న మాదిగ జనజాతర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ తెలిపారు. మర్రిపాడులో జనజాతర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ రమణయ్య మాదిగ, జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ గోపిమాదిగ, జిల్లా కోకన్వీనర్ ఇండ్ల సుధాకర్‌మాదిగ, కావలి, ఆత్మకూరు నియోజకవర్గ నాయకులు కాకుమూరి మధుమాదిగ, చంటయ్య మాదిగ, వెంకటయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మర్రిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు ప్రీస్కూల్ విద్యలో భాగంగా ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధా తెలిపారు. మండలంలోని తిక్కవరంలో బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని పిలుపునిచ్చారు.

వీధి దీపాలు వెలగక ఇక్కట్లు



సీతారామపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థినుల వసతి గృహ పరిసరాల్లో వీధి దీపాలు కొద్దిరోజులుగా వెలగడం లేదు. దీంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వసతి గృహం గ్రామానికి దూరంగా ఉంటుంది. వసతిగృహానికి వెళ్లే మార్గంలోనూ వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో వసతి గృహంలో పనిచేసే సిబ్బంది రాత్రి వేళల్లో రాకపోకల సాగించేందుకు విషసర్పాల భయంతో హడలిపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

రేపు గంగాభవాని గ్రామోత్సవం

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడిలో కొలువైన గంగాభవాని అమ్మవారి గ్రామోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా తొలుత అమ్మవారి ఉత్సవమూర్తి జల్ది కొలుపు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

అద్దె భవనంలోకి బీసీ బాలుర వసతిగృహం

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులోని శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతి గృహాన్ని అద్దె భవనంలోకి మార్చేందుకు బీసీ సహాయ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని వసతి గృహాధికారి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కలిగిన అద్దె భవనంలోకి వసతి గృహాన్ని మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భవనానికి అద్దె చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భవన యజమానులు కావలి సహాయ బీసీ సంక్షేమాధికారిని లేదా తనను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు సీపీఎం నాయకుడి సంతాప సభ

ఆత్మకూరు: సీపీఎం సీనియర్ నాయకుడు కొండమూరి పెదమస్తానయ్య 19వ సంస్మరణ సభను సీపీఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ప్రజా వైద్యశాల డాక్టర్ ఎంవీ రమణయ్య ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్యం, కార్పొరేటీకరణ అనే అంశంపై ప్రత్యేకంగా చర్చించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

సీతారామపురం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేశామని ఎంపీడీఓ అబ్దుల్ కలాంఆజాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 3,397 మంది పింఛన్‌దారులు ఉన్నారని తెలిపారు. 1వ తేదీ ఉదయాన్నే సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి నగదు అందిస్తారన్నారు. సచివాలయంలోని ఒక్కో సిబ్బందికి 50 పింఛన్లు పంపిణీ చేసే బాధ్యతను కేటాయించడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది సరిపోని పక్షంలో అంగన్‌వాడీ, ఇతర సిబ్బందికి పంపిణీ బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

కోటితీర్థం ఆలయ భూముల కౌలు వేలం

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం కోటితీర్థంలోని కోటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూముల వేలం పాటను శుక్రవారం నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మెట్ట, మాగాణి భూములకు వేలం నిర్వహించగా, గతంలో కంటే రూ.1.50 లక్షలు అధికంగా ఆదాయం వచ్చిందని ఈఓ కుడారి పెంచలప్రసాద్ తెలిపారు. సర్వే నంబర్ 638లోని 4.40 ఎకరాల భూమి రూ.1.40 లక్షలు, 643లోని 2.46 ఎకరాల భూమి రూ.50వేలు, 608లోని 4.12 ఎకరాల భూమి రూ.41వేలు, 666లోని 2.48 ఎకరాల భూమి రూ.27వేలు, 31లోని 3.53 ఎకరాల భూమిని రూ.56వేలకు వేలంలో రైతులు దక్కించుకున్నట్లు వివరించారు. మొత్తం రూ.3.14 లక్షల ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు.

సరస్వతి విగ్రహావిష్కరణ



సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రమణయ్య

వరికుంటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి దాత బోయిడి మాధవ ఏర్పాటు చేసిన సరస్వతీదేవి నూతన విగ్రహాన్ని ఎంఈఓ-2 రమణయ్య,హెచ్‌ఎం వీరభద్రయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాత మాధవ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలను భవిష్యత్‌లోనూ అందిస్తానన్నారు. ఏటా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వరికుంటపాడు ఉన్నత పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. అనంతరం దాతను ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, శ్రీను, ఉప్పు కొండయ్య, స్థానికులు ఏ పరంధామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మానసాదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విశేషాలంకరణలో మానసాదేవి

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్లలో కొలువైన మానసాదేవి బ్రహ్మోత్సవాలు చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా వెంగమాంబ బ్రహ్మోత్సవాలు అయిపోయిన మరుసటి రోజు నుంచి మానసాదేవి బ్రహ్మోత్సవాలను మూడ్రోజులపాటు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అందుల్లో భాగంగా తొలిరోజు ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, మూల విరాట్, ఉత్సవమూర్తులు నవగ్రహాలకు మహాస్నపనం, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాగా మానసాదేవి అమ్మవారిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్



వ్యాక్సిన్ వేస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

అల్లూరు: స్థానిక మసీద్ సెంటర్‌లో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఏఎన్‌ఎంలు ప్రమీల, రమమ్మ ఇంటింటికి తిరిగి వయోజనులకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకకుండా ముందస్తుగా వయోజనులకు వ్యాక్సిన్లు వేస్తున్నామని తెలిపారు. అలాగే 18 ఏళ్లు నిండిన మద్యం, పొగతాగే అలవాటు ఉన్న వారు, షుగర్ రోగులు, క్షయ బారిన పడి కోలుకున్న వారికి కూడా వ్యాక్సిన్లను వేస్తున్నామని వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హారిక, ఆశాకార్యకర్తలు చిన్ని, పద్మ, కళ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



చెన్నకేశవులను సత్కరిస్తున్న ఎంపీపీ దంపతులు

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న లేటి చెన్నకేశవులు ఉద్యోగ విరమణ సభను మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మస్తానయ్య, ఎంపీడీఓ రమాదేవి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిగా చెన్నకేశవులు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం చెన్నకేశవులును మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎంపీపీ బొడ్డు అనూరాధ శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలాని, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ నారాయణ, ఏఓ శేషసాయి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయుడ్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించారు. 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 28 ఏళ్ల తరువాత వారంతా ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ-2

సోమశిల: విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలం మినగల్లు, రేవూరు పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల పాఠ్యపుస్తకాలను పరిశీలించారు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఆత్మకూరు(అనుమసముద్రంపేట): ఏఎస్‌పేటం మండలం దూబగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రఘురామయ్య ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారిణి ఎం జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్‌ఎంగా రఘురామయ్య అందించిన సేవలను కొనియాడారు. అనంతరం హెచ్‌ఎంను ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి



గండిపాళెం జెడ్పీ హెచ్‌ఎస్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈఓ గోపాల్

ఉదయగిరి: మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్ ఆదేశించారు. మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి నాడు-నేడు పనుల పురోగతిని పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలుతీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నూర్జహాన్, ఉపాధ్యాయులు ఉన్నారు.